క్లుప్తంగా

పేదల సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం


ప్రజలకు పథకాల కోసం వివరిస్తున్న ఎంపీ ఎంవీవీ

బీచ్ రోడ్డు: పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. బుధవారం జీవీఎంసీ 28వ వార్డు ఊటగెడ్డ ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల కోసం వివరించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంవీవీ మాట్లాడుతూ రానున్న 2024 ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, మహిళా అధ్యక్షురాలు కృపా జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీబీసీ దృష్టికి శిష్టకరణ ఓబీసీ సమస్య


ఎన్‌సీబీసీ చైర్మన్ అహిర్‌కు వినతి పత్రం అందిస్తున్న అనూష పట్నాయక్

బీచ్ రోడ్డు: శిష్టకరణాలను ఓబీసీలో చేర్చాలని కోరుతూ జాతీయ వెనుకబడిన వర్గాల కమిషన్(ఎన్‌సీబీసీ) చైర్మన్ అహిర్‌కు రాష్ట్ర శిష్టకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష పట్నాయక్ వినతిపత్రం అందజేశారు. బుధవారం ఢిల్లీలో ఎన్‌సీబీసీ నిర్వహించిన సమస్య పరిష్కార వేదికలో ఆమె పాల్గొని అహిర్ దృష్టికి శిష్టకరణాల సమస్యలను తీసుకెళ్లారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కూడా సిఫార్సు చేసినట్లు గుర్తు చేశారు. ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లి అతి త్వరలో ఓబీసీలో చేర్చేలా చర్యలు తీసుకుంటామని అహిర్ హామీ ఇచ్చారు.

ఏయూ అభివృద్ధి హర్షణీయం


వీసీ ప్రసాదరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న యాపిల్ సంస్థ సీనియర్ మేనేజర్ వెంకటరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం అభివృద్ధి చెందుతున్న విధానం సంతోషాన్నిస్తోందని అమెరికాలోని యాపిల్ సంస్థ సీనియర్ మేనేజర్ కె.వెంకటరెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఏయూను సందర్శించి, వీసీ ఆచార్య ప్రసాదరెడ్డితో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏయూలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, నూతన ప్రాజెక్టులను వీసీ వివరించారు. యువతను ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దేందుకు ఏర్పాటు చేసిన ఆ హబ్ స్టార్టప్, ఇంక్యుబేషన్ సెంటర్ పనితీరును తెలియజేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం అభివృద్ధిపై ఇద్దరూ కొద్దిసేపు చర్చించారు.

తిమ్మాపురంలో షూటింగ్ సందడి


లొకేషన్‌లో నటుడు సప్తగిరి

కొమ్మాది: భీమిలి బీచ్‌రోడ్డు తిమ్మాపురంలో బుధవారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. సప్తగిరి, శత్రు హీరోలుగా నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను ఇక్కడ ఓ రిసార్ట్‌లో చిత్రీకరించారు. ఈ చిత్రానికి పి.సుబ్రహ్మణ్యం దర్శకత్వం వహిస్తున్నారు. ఇంకా టైటిల్ ఖరారు కాలేదని, మరో మూడు రోజులు బీచ్ రోడ్డు ప్రాంతంలో షూటింగ్ ఉంటుందని ఆయన తెలిపారు.

కొత్త పింఛన్ల పంపిణీతో ఉత్సాహం


20వ వార్డులో పెన్షన్ అందిస్తున్న సిబ్బంది


19వ వార్డులో పెన్షన్లు అందజేస్తున్న ఎంపీ ఎంవీవీ, తదితరులు

ఏయూ క్యాంపస్: స్థానిక 20వ వార్డు పెదవాల్తేరు 96 సచివాలయం పరిధిలో కొత్తగా మంజూరైన పెన్షన్లను బుధవారం అందజేశారు. సచివాలయం కన్వీనర్ వై.రమణరెడ్డి లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ డబ్బులు అందించారు. ఈ కార్యక్రమంలో టి.శ్రీకాంత్, గృహ సారథి కె.వెంకటరమణరెడ్డి, సచివాలయం సిబ్బంది సత్తిబాబు పాల్గొన్నారు. తమకు పెన్షన్ మంజూరు కావడంపై లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

19వ వార్డులో..

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 19వ వార్డులో ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ పెన్షన్లు పంపిణీ చేశారు. పార్టీ వార్డు ఇన్‌చార్జ్ సూరాడ వెంకటలక్ష్మితో కలిసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి కొత్త పెన్షన్ డబ్బులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రికార్డు స్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా 1,93,680 మందికి కొత్తగా పెన్షన్ మంజూరు చేశామన్నారు. దీంతో రికార్డు స్థాయిలో 66,98,138 మందికి పెన్షన్ అందజేస్తున్న ప్రభుత్వంగా వైఎస్సార్‌సీపీ నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు నాయకులు సూరాడ దాసు, పేర్ల విజయచందర్, గురునాథం, తదితరులు పాల్గొన్నారు.

22వ వార్డులో..


22వ వార్డులో లబ్ధిదారుడికి పింఛన్ అందిస్తున్న పీతల గోవింద్

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డులో కొత్తగా మంజూరైన పింఛన్లను పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్ లబ్ధిదారులకు అందజేశారు. పార్టీలు, మతాలకు అతీతంగా అర్హులైన అందరికీ పెన్షన్ మంజూరు చేస్తున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పర్యావరణహితంగా వినాయక చవితి పూజ


మట్టి వినాయక ప్రతిమలు తయారు చేస్తున్న విద్యార్థిని



మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న విశ్వనాథం

ఏయూ క్యాంపస్: పర్యావరణహిత జీవన విధానం ప్రతి ఒక్కరికి అవసరమని ఏయూ సోషల్ వర్క్ విభాగాధిపతి ఆచార్య సర్వసిద్ధి హరనాథ్ అన్నారు. బుధవారం ఉదయం ఏయూ సోషల్ వర్క్ విభాగంలో గ్రీన్‌క్లైమేట్ సభ్యుల నేతృత్వంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మట్టి గణనాథుని ప్రతిమలను తయారు చేశారు. ఈ సందర్భంగా హరనాథ్ మాట్లాడుతూ ప్రకృతితో అనుసంధానమైన పండుగగా వినాయక చవితి నిలుస్తుందన్నారు. అనంతరం పెందుర్తి మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కంచిపాటి విశ్వనాథం విద్యార్థులు, సిబ్బందికి మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. ఏయూ సోషల్ వర్క్ విభాగం, హెచ్‌ఆర్‌డీసీ, కెడీపీఎం పాఠశాల పెద్దవాల్తేరు, శివాజీపాలెం విద్యా సంస్థలో ఉపాధ్యాయులకు మట్టి వినాయక ప్రతిమలు అందజేశారు. గ్రీన్‌క్లైమేట్ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం మాట్లాడుతూ ఈ ఏడాది 100 విద్యా సంస్థల్లో పంపిణీ లక్ష్యంగా పెట్టుకుని మట్టి వినాయక ప్రతిమలను తయారు చేస్తున్నామన్నారు. ఎకో వైజాగ్‌ను జయప్రదం చేద్దాం, మిషన్ లైఫ్‌ను ఆచరిద్దాం అని పిలుపునిచ్చారు.

బీసీల చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

ఎంవీపీ కాలనీ: రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపు మేరకు నిర్వహించనున్న బీసీల చలో ఢిల్లీ పోస్టర్‌ను విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ బుధవారం లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దేశంలో బీసీలకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తున్న పార్టీగా వైఎస్సార్‌సీపీ నిలిచిందన్నారు. బీసీ బిల్లు ప్రవేశపెట్టాలంటూ వైఎస్సార్‌సీపీ ఎంపీలు పార్లమెంట్‌లో తమ వాణి వినిపించారన్నారు. దీంతో పాటు బీసీ బిల్లు కోసం అసెంబ్లీ తీర్మానం చేసిన తొలి రాష్ట్రంగా ఏపీ నిలిచిందన్నారు. రాష్ట్ర బీసీ సంఘం కన్వీనర్ పితాని ప్రసాద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పార్లమెంట్, అసెంబ్లీ సీట్ల కేటాయింపుల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ ఈ నెల 21న చలో ఢిల్లీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు మొల్లి అప్పారావు, బీసీ నాయకులు రామన్న పాత్రుడు, పోలవరపు నరసింగ రావు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి


రక్తదాన శిబిరాన్ని సందర్శిస్తున్న సీతారాం తదితరులు

ఎంవీపీ కాలనీ: రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం కోరారు. ఎంవీపీ కాలనీ సెక్టార్-1లో స్నేహ మిత్ర ఆర్మీ యూత్ క్లబ్ నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాద సమయంలో అనేక మందికి రక్తం అవసరం అవుతుందన్నారు. సకాలంలో సదరు గ్రూప్ రక్తాన్ని అందించగలిగితే ప్రాణాపాయం నుంచి తప్పించవచ్చన్నారు. అలాంటి పరిస్థితులను అధిగమించడానికి సమాజంలో అన్ని గ్రూపుల రక్త నిల్వలు అవసరమన్నారు. రక్తదానాన్ని అతిపెద్ద సమాజ సేవగా భావించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫైర్ ఆఫీసర్ రేణుకయ్య, న్యూ లైఫ్ బ్లడ్ సెంటర్ అధ్యక్షుడు గోవిందరావు, క్లబ్ అధ్యక్షుడు కాళ్ల రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నిత్య కల్యాణం


తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడా మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

పూడుకుపోయిన కాలువలు


ఆదర్శనగర్‌లో చెత్తతో నిండిన కాలువ

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు ఆదర్శనగర్‌లో పలు వీధి కాలువలు చెత్తతో పూడుకుపోయాయి. డెయిరీ ఫారం నుంచి రవీంద్రనగర్ వరకు ఉన్న ప్రధాన రహదారికి ఇరువైపులా షాపులు, టిఫిన్ సెంటర్ల వద్ద కాలువలు మరింత అధ్వానంగా తయారయ్యాయి. టీ తాగిన డిస్పోజిబుల్ గ్లాసులు, కొబ్బరి పీచు, ఖాళీ బొండాలు కాలువల్లో వేసేస్తున్నారు. దీంతో చెత్త అడ్డం పడడంతో పైనుంచి వచ్చే స్థానికుల వాడుక నీరు కిందకు పోవడానికి వీలు పడడం లేదు. ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోతోంది. దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఆదర్శనగర్ ప్రాంతం అరుణోదయ పాఠశాల సమీపంలో కాలువలు మరింత మురుగుతో నిండిపోయాయి. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది దృష్టిపెట్టి కాలువలు శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

క్వాంటమ్ కంప్యూటింగ్‌పై సదస్సు

కొమ్మాది: దేశ రక్షణ, ఆర్థిక రంగాల్లో సమాచార భద్రతకు ఉపకరించే క్వాంటమ్ కంప్యూటింగ్‌పై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో కలకత్తా విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ వీకే చౌదరి పాల్గొన్నారు. వివిధ రంగాల్లో క్వాంటమ్ కంప్యూటింగ్ ప్రయోజనాలను ఆయన వివరించారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే శిక్ష తప్పదు

- విద్యార్థులు స్నేహభావం కలిగి ఉండాలి
- జిల్లా అదనపు న్యాయమూర్తి వాణిశ్రీ


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా అదనపు, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి వాణిశ్రీ

డాబాగార్డెన్స్ : విద్యార్థులు స్నేహ భావం కలిగి ఉండాలని, సీనియర్లు జూనియర్లను ర్యాగింగ్ చేస్తే శిక్ష తప్పదని జిల్లా అదనపు న్యాయమూర్తి, ఫ్యామిలీ కోర్టు జడ్జి వాణిశ్రీ పేర్కొన్నారు. జిల్లా లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో ర్యాగింగ్ చట్టం 1997పై బుధవారం ఏవీఎన్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న వాణిశ్రీ మాట్లాడుతూ విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడం, న్యాయ వ్యవస్థపై గౌరవభావం కలిగి ఉండడం అవసరమన్నారు. జూనియర్లను సీనియర్లు ర్యాగింగ్ చేసే విధానం ఎన్నో ఏళ్ల నుంచి కళాశాల స్థాయిలో జరుగుతున్న నేపథ్యంలో ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా చట్టం ఏర్పడిందని, ఈ చట్టానికి లోబడి ప్రతి పౌరుడు ఉండాల్సిందేనన్నారు. సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి ఎంవీ శేషమ్మ మాట్లాడుతూ ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు పౌర సమాజంలో ఎన్నో మంచి మార్పులు వచ్చేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు యేసయ్య, ఆనంద్, వెంకటరత్నం, గాయత్రి, వినీత ర్యాగింగ్ చట్టాలు, శిక్షలపై మాట్లాడారు. ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రి నాయుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ అంబేడ్కర్ న్యాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్‌వీకే ప్రసాద్, ఆంధ్రా మెడికల్ కళాశాల ఫిజియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ పీఎస్ఎస్ రాజు, ప్రభుత్వ మానసిక ఆసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె. మాధవీలత, లీగల్ సెల్ అథారిటీ ప్యానెల్ న్యాయవాది కె. అప్పలనాయుడు, ఏవీఎన్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, ఇంగ్లీషు విభాగాధిపతి పైడి రజని అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వారి వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

5న సన్ ప్లై ఓవర్సీస్ వెబ్‌సైట్ ఆవిష్కరణ

ఏయూ క్యాంపస్: సన్ ప్లై ఓవర్సీస్ వెబ్‌సైట్‌ని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో వచ్చే నెల 5న ఆవిష్కరిస్తామని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.శృతి తెలిపారు. ఈ మేరకు వెబ్‌సైట్ పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.జి.వి.డి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. విదేశాలకు వెళ్లి చదువుకోవాలని ఆనుకునే అర్హత గల విద్యార్థులకు సన్ ప్లై సంస్థ మార్గదర్శకం చేస్తూ అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందని శృతి తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సూర్యతేజ, తదితరులు పాల్గొన్నారు.

ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం


ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డులోని దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి జలాభిషేకం భక్తిపూర్వకంగా జరిపారు. ఈ కార్యక్రమానికి దొండపర్తి, రైల్వేన్యూకాలనీ, పెదవాల్తేరు, మద్దిలపాలెం, అక్కయ్యపాలెం, శివాజీపాలెం, ఎన్ఏడీ, సీతమ్మధార, నక్కవానిపాలెం, రేసపువానిపాలెం, జగదాంబ, వన్‌టౌన్, నెహ్రూబజారు తదితర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వయంగా పసుపునీళ్లతో అమ్మవారికి జలాభిషేకం చేశారు. సాయంత్రం అమ్మవారిని పసుపు, కుంకుమ, పలు రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వెలుగుచూసింది. దయానంద్‌నగర్ చాకలిగెడ్డలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న దమరసింగి కృష్ణ(35)లేబర్ పని చేస్తుంటాడు. మూడు నెలల కిందట అతడి భార్య ఇద్దరు పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లి తిరిగిరాలేదు. పదే పదే రమ్మని అడుగుతున్నా ఆమె రావడానికి నిరాకరించింది. మంగళవారం రాత్రి 9 గంటల తర్వాత నిద్ర పోవడానికి గదిలోకి వెళ్లాడు. బుధవారం ఉదయం సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతిచెందడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

విద్యా సమాచారమ్

జీవరాసుల మనుగడకు వృక్షాలు ఆధారం


ప్రసంగిస్తున్న ఆచార్య జి.సాల్మన్‌రాజు

ఏయూ క్యాంపస్: జీవరాసుల మనుగడకు వృక్షాలు ఆధారంగా నిలుస్తాయని ఏయూ పర్యావరణ శాస్త్ర విభాగ ఆచార్యుడు జి.సాల్మన్‌రాజు తెలిపారు. ఏయూ హెచ్‌ఆర్‌డీసీ కేంద్రంలో నిర్వహిస్తున్న పర్యావరణ శాస్త్ర పునశ్చరణ తరగతుల్లో అధ్యాపకులనుద్దేశించి ఆయన ప్రత్యేక ప్రసంగం చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న అడువులు, వృక్ష వైవిధ్యత, పుష్పాలు, వృక్షాలతో ఇతర జీవులకు ఉన్న అనుబంధం కళ్లకు కట్టినట్లు వివరించారు. కీటకాలు, పక్షులకు వృక్షాలు ఆధారంగా నిలుస్తున్న విధానాన్ని ఫొటోలతో సహ అవగాహన కల్పించారు. కలుపు మొక్కల నుంచి వచ్చే పువ్వులు సైతం సీతాకోక చిలుకలు, తేనెటీగలు, పక్షులకు ఉపయుక్తంగా నిలుస్తున్న విధానాన్ని వివరించారు. ప్రధానంగా వేసవిలో అనేక పక్షులు, జీవులకు ప్రాణాధారంగా వృక్షాలు నిలుస్తున్న విధానాన్ని తెలియజేశారు. శేషాచలం అడవుల్లో దర్శనమిచ్చే వివిధ ఔషధ, సుగంధ వృక్షాల ప్రత్యేకతలను వివరించారు. తూర్పు, పశ్చిమ కనుమల్లో ఉండే వృక్ష వైవిధ్యతలు, గిరిజన ప్రాంతాలలో ఉండే చెట్లు, పుష్పాల విశిష్టతను తెలియజేశారు. పలు పుష్పాలు పురుగులను ఆకర్షించి తిరిగి వెళ్లనివ్వకుండా మరణించేలా చేస్తాయని, వీటిని కిల్లర్ ఫ్లవర్‌గా పిలుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్రం సంచాలకులు ఆచార్య టి.వెంకటకృష్ణ, ఆచార్య ఎన్.ఎ.డి.పాల్, తదితరులు పాల్గొన్నారు.

ఆచార్యుడు రాధాకృష్ణ మృతికి సంతాపం


డాక్టర్ రాధాకృష్ణ చిత్ర పటానికి నమస్కరిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం ఆచార్యుడు డాక్టర్ ఎల్.రాధాకృష్ణ(50) సీతమ్మధారలోని ఆయన నివాసంలో గుండెపోటుకు గురై మృతిచెందారు. ఆయన అకాల మృతికి విభాగ ఆచార్యులు, విద్యార్థులు సంతాపం తెలిపారు. బుధవారం విభాగంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో రాధాకృష్ణ చిత్రపటానికి ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్, విభాగాధిపతి ఆచార్య జాలాది రవి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ రాధాకృష్ణతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఏవీఎన్ కళాశాల నుంచి 2020లో ఆంధ్ర విశ్వవిద్యాలయానికి డిప్యుటేషన్‌పై వచ్చిన రాధాకృష్ణ ఎంతో నిబద్ధతతో సేవలు అందించారని కొనియాడారు. స్వశక్తితో ఎదిగి, ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన మంచి వ్యక్తిని కోల్పోవడం తీరని లోటన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం కావాలి

- ఎంపీ, పార్టీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ
- 18, 22 వార్డుల నాయకులతో సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ

ఎంవీపీ కాలనీ/బీచ్ రోడ్డు: లాసన్స్‌బే కాలనీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 18, 22 వార్డుల ముఖ్యనాయకులు, కార్యకర్తలతో విశాఖ ఎంపీ, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వార్డుల వారీగా సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలే రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు బాటలు వేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డు పార్టీ నాయకుడు పుక్కళ్ల శంకర్, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, వార్డు ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 22వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుల ఆత్మీయ సమావేశం ఎంపీ ఎంవీవీ క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ అర్హులకు సంక్షేమ పథకాలు అందజేసేలా కార్యకర్తలు పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంయూఏ గుర్తింపుపై సంబరాలు


మద్దిలపాలెం డిపో వద్ద సంబరాలు చేసుకుంటున్న ఎన్‌ఎంయూఏ నాయకులు

మద్దిలపాలెం : నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్‌కు ప్రభుత్వ గుర్తింపు లభించడంతో మద్దిలపాలెం డిపో వద్ద ఆ యూనియన్ నాయకులు బుధవారం సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేశారు. మిఠాయిలు పంచుకున్నారు. ఆనందోత్సవాలలో భాగంగా భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్‌కు గుర్తింపు తీసుకురావడానికి కృషి చేసిన రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జోనల్ కార్యదర్శి ఎం.వి.ఆర్.మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేట్'కు లాభం చేకూర్చేందుకే ప్రైవేటీకరణ


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న నాయకుడు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం కుట్రపూరిత ఆలోచనతోనే ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చేందుకు ఇటువంటి కుట్రలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 944వ రోజు బుధవారం సంస్థకు చెందిన ఎస్ఎంఎస్-1 విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో కేవలం రూ.10 కోట్ల ఖర్చుతో 1700 టన్నుల ఆక్సిజన్ తయారుచేస్తోందన్నారు. కానీ కేంద్రప్రభుత్వం దుర్మార్గపు ఆలోచనతో ప్రైవేట్‌వారికి రూ. 50 కోట్లు ఖర్చు చేయడానికి అంగీకరించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికే విశాఖ స్టీల్ ప్లాంట్ 2700 టన్నుల ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేస్తోందని, మరో 1700 టన్నుల ఆక్సిజన్ ఉత్పత్తికి అవసరమైన ప్లాంట్‌ను నిర్మించడం జరిగిందని తెలిపారు. కానీ నేడు కేంద్రప్రభుత్వం ప్లాంట్‌ను నడపలేమని చెప్పడం సరికాదన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తామనే ప్రకటన చేయాలని, లేనిపక్షంలో తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పోరాట కమిటీ నాయకులు ఆదినారాయణ, అయోధ్య రామ్, పరంధామయ్య, ఎస్ఎంఎస్-1 ప్రతినిధులు విడివి పూర్ణచంద్రరావు, రమణమూర్తి, ముత్యాల నాయుడు, గుమ్మడి నరేంద్ర పాల్గొన్నారు.

NOTICE UNDER ORDER 21 RULE 46 OF CODE OF CIVIL PROCEDURE IN THE COURT OF THE HONOURABLE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM

E.P.443/2019 in O.S.227/2016

Between :
A.China Satyanarayana Reddy ...Decree-holder
AND:
Gadi Srinivas (died) and another ...Judgment-debtors

To
R-3) Gadi Ganga Ratnam, W/o late Gadi Srinivas, Hindu, aged about 53 years, D.No.51-8-34/3, Nakkavanipalem, Visakhapatnam.
R-4) Gadi Krishna Kanth, S/o late Gadi Srinivas, Hindu, aged about 27 years, rest. Do.
R-5) Gadi Haritha, D/o late Gadi Srinivas, Hindu, aged about 26 years, rest. Do.

Take notice that the above Petition filed by the above Dhr under Order 21 Rule 46 r/w Sec: 60 of C.P.C., in which the Honourable court ordered notice to you. Therefore, you are hereby summoned to appear in the above court, in person or through an advocate duly instructed and able to answer all material questions relating to the above matter on 29-09-2023 at 10.30.a.m. in default of your appearance on that day, the matter will be determined in your absence.

(By Court Order)
BEVARA SIMHACHALAM
Advocate for the Dhr
Cell: 8639048855, 97007 37477.